నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 9 జనవరి 2024 | SURYAPET

కలెక్టర్‌గా హరిచందన బాధ్యతల స్వీకరణ

కలెక్టర్ హరిచందన

నల్లగొండ ప్రతినిధి, జనవరి 8(నమస్తే తెలంగాణ) : నల్లగొండ కలెక్టర్‌గా దాసరి హరిచందన సోమవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆర్‌వీ కర్ణన్‌ను గత నెల 17న ప్రభుత్వం వైద్యారోగ్య శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న హేమంత్ కేశవ్ పాటిల్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. సోమవారం హేమంత్ కేశవ్ పాటిల్ నుంచి కలెక్టర్‌గా దాసరి హరిచందన బాధ్యతలు స్వీకరించారు. హరిచందన ఇప్పటివరకు ఆయూష్ కమిషనర్ బాధ్యతలతో పాటు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్రజా వాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా పని చేస్తుండగా ఈ నెల 3న జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్న హరిచందనకు కలెక్టరేట్ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం నేరుగా తన చాంబర్‌కు చేరుకొని కలెక్టర్‌గా అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ చందనాదీప్తి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) జె.శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, అర్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలెక్టర్ హరిచందనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలి

లేదంటే డీడీ డబ్బులైనా తిరిగివ్వాలి

- గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్
- గొల్ల కురుమలతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన

గొల్లకురుమలతో కలిసి నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్

నల్లగొండ, జనవరి 8 : రెండో విడుత గొర్రెల పంపిణీలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 7,850 మంది అర్హులు డీడీలు చెల్లించారని, వారందరికీ గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని, లేకుంటే డీడీల డబ్బులైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులు ధర్నా చేశారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు యాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లాలో 62 వేల మందికి గొర్రెల యూనిట్లు ఇస్తామని తొలి విడుతలో 32 వేల మందికి ఇచ్చిందని, రెండో విడుతలో 30 వేల మందికి ఇవ్వాల్సి ఉండగా.. వారిలో ఇప్పటి వరకు సబ్సిడీ పోను ఒక్కొక్కరి దగ్గర రూ.43,750 డీడీల రూపంలో మొత్తంగా రూ.34.34 కోట్లు సేకరించి కలెక్టర్ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. వారికి యూనిట్లు ఇచ్చే సమయంలో ఎన్నికల కోడ్ వచ్చి ఆగిపోయినందున డీడీలు చెల్లించిన వారికి వెంటనే యూనిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే కట్టిన డీడీలు అయినా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే వినతిపత్రం ఇచ్చే సమయంలో కలెక్టర్‌తో పాటు కలెక్టరేట్ ఏఓలు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదవసంఘం అధ్యక్షుడు గుండెబోయిన అయోధ్య, కార్యదర్శి చలకాని మల్లేశ్, మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్రన్న, నాగార్జునసాగర్ అధ్యక్షుడు కుంటిగొర్ల లింగయ్య, నకిరేకల్ అధ్యక్షుడు చింతల సందీప్, మునుగోడు అధ్యక్షుడు గుండెబోయిన వెంకటేశ్, ఆయా మండలాల అధ్యక్షులు పాక రమేశ్, కన్నెబోయిన అంజిబాబు, జానపాటి శంకర్, బుర్ర వెంకటయ్య, బండారి శంకర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గొర్రెలు ఇవ్వకపోతే డీడీ డబ్బులైనా ఇవ్వండి

గత ప్రభుత్వం రెండో విడుత గొర్రెల పంపిణీ కింద నాకు యూనిట్ ఇస్తానంటే వ్యక్తిగత వాటా కింద రూ.43,750 ఎస్‌బీఐలో డీడీ తీసి పశు సంవర్ధక శాఖ అధికారులకు అందజేశాను. డీడీలు కట్టి ఇప్పటికే రెండు నెలలు అవుతున్నది. ఇన్ని రోజులు ఎన్నికలు అని ఆపిండ్రు. ఇప్పుడు ఎన్నికలు అయిపోయినందున నాకు సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేయాలి. లేకుంటే డీడీ డబ్బులైనా ఇవ్వాలి.

– చింతల సందీప్, మంగళపల్లి, నకిరేకల్ మండలం

ఎంజీయూ పరిధిలో 16 వరకు సంక్రాంతి సెలవులు

రామగిరి, జనవరి 8: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలలకు గతంలో ప్రకటించిన సంక్రాంతి సెలవుల్లో మార్పులు చేసినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ నెల 7 నుంచి 15 వరకు సెలవులు ప్రకటించగా వాటిని ఈ నెల 7నుంచి 16 వరకు పొడిగించామని పేర్కొన్నారు. 17న కళాశాలలు పునఃప్రారంభం చేయాలని సూచించారు.

తిరుమలగిరి మండలం వెలిశాల వద్ద 69 డీబీఎం కాల్వలో ప్రవహిస్తున్న కాళేశ్వరం జలాలు

యాసంగికి కాళేశ్వరం జలాలు విడుదల

మార్చి 30 వరకు వారబందీ పద్ధతిలో 6 తడుల్లో నీరు

- పూలు చల్లి నీటి విడుదల చేసిన ఎమ్మెల్యే మందుల సామేల్
- రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని వెల్లడి

జనగామ జిల్లా కొడకండ్ల మండలం బయ్యన్న వాగు రిజర్వాయర్ వద్ద నీటి పారుదల అధికారులతో కలిసి కాళేశ్వరం జలాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి, జనవరి 8 : ప్రస్తుత యాసంగి సీజన్‌కు ఎస్సారెస్పీ రెండో దశ ద్వారా సూర్యాపేట జిల్లాకు కాళేశ్వరం జలాలు విడుదలయ్యాయి. జనగామ జిల్లా కొడకండ్ల మండలం బయ్యన్నవాగు రిజర్వాయర్ వద్ద తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి సోమవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన జలాలకు పుష్పాభిషేకం చేశారు. అనంతరం సామేల్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా కాళేశ్వరం జలాలను విడుదల చేశామన్నారు. ఈ నెల 8 నుంచి మార్చి 30 వరకు వారబందీ పద్ధతిలో నీటి విడుదల కొనసాగుతుందని, రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. రోజుకు 4 వేల క్యూసెక్కుల చొప్పున 6 తడుల్లో 48 రోజులు నీటి విడుదల జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు నరేశ్, నీటి పారుదల శాఖ అధికారులు ఈఈ విజయ్‌కుమార్, డీఈలు సత్యనారాయణ, పిచ్చయ్య, నవీన్‌కుమార్, మురళీకృష్ణ, ఏఈలు అమర్‌నాథ్, స్వరూప, శ్రీకాంత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నీటి విడుదల షెడ్యూల్

విడుత	తేదీ
మొదటి	జనవరి 8–15వరకు
రెండో	23– 30వరకు
మూడో	ఫిబ్రవరి7– 14వరకు
నాలుగో	22–29వరకు
ఐదో	మార్చి 8– 15వరకు
ఆరో	23– 30వరకు

మూడు సంవత్సరాల నుంచి నిరంతరాయంగా నీరు

ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కాళేశ్వరం జలాలు మూడు సంవత్సరాల నుంచి నిరంతరాయంగా వస్తుండడంతో కరువు ప్రాంతమైన తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలు సస్యశ్యామలయ్యాయి. తిరుమలగిరి మండలంలోని వెలిశాల 69 డీబీఎం నుంచి తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాలకు, 70 డీబీఎం ద్వారా నాగారం మండలం, 71 డీబీఎంతో నాగారం, అర్వపల్లి మండలాలతోపాటు సూర్యాపేట నియోజకవర్గంలోని ఆత్మకూర్ ఎస్, చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాలతోపాటు కోదాడ నియోజక వర్గంలోని మోతె, నడిగూడెం మండలాల్లోని పలు గ్రామాలకు కాళేశ్వరం జలాలు అందుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో ఎస్సారెస్పీ కింద 2,23,000 ఎకరాల ఆయకట్టు ఉన్నది.

దళిత బంధు లబ్ధిదారులతో కలిసి నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

దళితబంధు యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలి

- దళితుల ఆశలను అడియాశలు చేయొద్దు
- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- దళితబంధు సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద దీక్ష

నల్లగొండ, జనవరి 8 : నల్లగొండ నియోజకవర్గంలో దళితబంధు కింద ఆర్థిక సాయం చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 1100 మంది నిరుపేద దళితులను ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ ఇచ్చినందున వారికి వెంటనే దళితబంధు యూనిట్లను మంజూరు చేస్తూ గ్రౌండింగ్ చేయాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితబంధు సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టగా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ నియోజకవర్గంలో తొలి విడుతగా 100 మంది లబ్ధిదారులకు దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఆర్థిక సాయం చేసి వారికి కావాల్సిన యూనిట్లు మంజూరు చేయడంతో నేడు వారంతా సంతోషంగా జీవిస్తున్నట్లు తెలిపారు. దాంతో రెండో విడుత కింద 1100 మందిని ఎంపిక చేసి గత ఎన్నికల ముందు ప్రొసీడింగ్స్ అందజేయగా ఎన్నికల కోడ్‌తో అది ఆగిపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ పథకం కింద యూనిట్లు వస్తాయని ఆశపడ్డ దళితుల ఆశలు వమ్ము అవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి పాటుపడాలని, అందుకు వెంటనే లబ్ధిదారులకు యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దళితబంధు సాధన కమిటీ కన్వీనర్ పాలడుగు నాగార్జున మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వమైనా ఒక చట్టం చేస్తే, ఆ తర్వాత వచ్చే ప్రభుత్వం దానిని అమలు చేసే బాధ్యతను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే ప్రభుత్వాలు చేసే చట్టాలకు, పథకాలకు విలువ ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, నల్లగొండ మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, బకరం వెంకన్న, అద్దంకి దయాకర్, కందుల లక్ష్మయ్య, బడుపుల శంకర్, చింత సైదులు, కందుల రమేశ్, విమలమ్మ, యాదమ్మ, జాకటి బాలరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అధికారులను అడిగినా పట్టించుకోవట్లే..

దళితులు ఆత్మగౌరవంగా జీవించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం తెచ్చింది. నా పేరున దళితబంధుకు దరఖాస్తు చేస్తే ఎంపికవడంతో అధికారులు నాతో బ్యాంకు ఖాతా తీయించారు. సూపర్ మార్కెట్, బ్యూటీ పార్లర్, కారు కొనుగోలుకు సంబంధించి యూనిట్లను ఎంపిక చేసుకున్నాం. అధికారులు వీటిలో ఒకటి ఇస్తామన్నారు. ప్రభుత్వం మారడంతో దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేదు. అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదు. రెక్కాడితే డొక్కాడని బతుకులు మావి. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే గత ప్రభుత్వం ప్రొసీడింగ్స్ ఇచ్చిన వారందరికీ యూనిట్లను గ్రౌండింగ్ చేయాలి.

– బొల్లు క్రాంతి, అక్కచెల్మ

ప్రభుత్వం స్పందించాలి

కేసీఆర్ సర్కారు తెచ్చిన దళితబంధు పథకంతో నా జీవితకల సాకరమైందని ఆశ పడ్డాను. దళితబంధులో ట్రాక్టర్, కారు, టెంట్‌హౌజ్ పెట్టుకున్నా. స్వయానా అప్పటి జిల్లా కలెక్టరే నాకు ప్రొసీడింగ్స్ కాపీ అందజేశారు. కానీ, నేడు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం దానిని పట్టించుకోకపోవడం దారుణం. ప్రస్తుతం కూలి చేసుకుంటూ జీవనం గడుపుతున్నా. ఆలస్యం చేయకుండా ప్రభుత్వం తక్షణమే దళితబంధు యూనిట్ల గ్రౌండింగ్‌ను పూర్తి చేయాలి.

–బాకి నర్సింహ, అన్నెపర్తి, నల్లగొండ


డీసీసీబీలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

డిపాజిట్ల సేకరణకు మాసోత్సవాలు

డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

సహకార బ్యాంక్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నల్లగొండ, జనవరి 8 : జనవరి 1 నుంచి ఫిబ్రవరి 29 వరకు సహకార బ్యాంకుల పరిధిలో డిపాజిట్ల సేకరణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో 2024 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల పాటు సహకార బ్యాంకుల్లో డిపాజిట్ల మాసోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు డిపాజిట్లను ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుతం డీసీసీబీలో రూ.665 కోట్ల డిపాజిట్లు ఉంటే, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.103 కోట్లు సేకరించినట్లు తెలిపారు. ఇంకా మూడు నెలల సమయం ఉన్నందున మరిన్ని డిపాజిట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. అలాగే బంగారు రుణాల విషయంలో ఏ బ్యాంకులు కూడా ఇవ్వని విధంగా గ్రాముకు రూ.4,500 రుణం ఇవ్వడంతోపాటు 9.9 శాతం మాత్రమే వడ్డీ విధిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం డిపాజిట్ల మాసోత్సవాల్లో భాగంగా ధన సమృద్ధి డిపాజిట్ కింద 333 రోజులకు గానూ 7.75 శాతం, ధనవర్ష డిపాజిట్ కింద 111 రోజులకు 6.50 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిపాజిట్లపై ఐదు లక్షల వరకు బీమా సౌకర్యం ఉందని, కేవలం పది నిమిషాల్లోనే రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, సైదులు, అంజయ్య, రంగాచారి, రాంచందర్, జయరాం, శ్రీనివాస్, కరుణ, అనూరాధ పాల్గొన్నారు.

అధికారమే పరమావధి!

జట్టుకట్టిన కాంగెస్, బీజేపీ, ఎంఐఎం

విప్‌ను ధిక్కరించిన పలువురు బీఆర్ఎస్ సభ్యులు

- నల్లగొండ మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం
- విప్‌ను పరిశీలించిన అనంతరం చర్యలు : అదనపు కలెక్టర్
- అధికార దాహంతోనే కుమ్మక్కు రాజకీయం : సైదిరెడ్డి

నల్లగొండ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో అవిశ్వాస తీర్మానానికి హాజరైన కౌన్సిలర్లు

నీలగిరి, జనవరి 8 : అధికారమే పరమావధిగా అనైతికంగా కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయి. వీరికి ఎంఐఎం కూడా తోడైంది. బీఆర్ఎస్‌లో గెలిచిన కొందరు కౌన్సిలర్లు పార్టీ విప్‌ను ధిక్కరిస్తూ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటేశారు. కుమ్మక్కు రాజకీయంతో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి (బీఆర్ఎస్)పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది.

నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై పెట్టిన అవిశ్వాసంపై సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 11 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సిండగా ఐదు నిమిషాల ముందుగానే కాంగ్రెస్ క్యాంపునకు వెళ్లిన సభ్యులు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌కు చేరుకున్నారు. తరువాత బీజేపీ సభ్యులు, ఎంఐఎం సభ్యులు, బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్‌తోపాటు మరో నలుగురు సభ్యులు వేర్వేరుగా సమావేశానికి హాజరయ్యారు. దీంతో 11.30 నిమిషాలకు కౌన్సిల్ సమావేశం అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధ్యక్షతన జరిగింది. మొత్తం 48 మంది సభ్యులకు గానూ 47 మంది హాజరుకాగా బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాత్రం గైరాజరయ్యారు. మరో ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు (మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి) సమావేశానికి రాలేదు. దాంతో మొత్తం 47 ఓట్లకు గానూ అవిశ్వాసానికి అనుకూలంగా 41, వ్యతిరేకంగా చైర్మన్ సైదిరెడ్డితోపాటు మారగోని భవాని, యామ కవితారాణి, అభిమన్యుశ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనువాస్ ఓటు వేశారు. ఫార్వర్డ్ బ్లాక్‌లోకి వెళ్లిన బీఆర్ఎస్ సభ్యుడు పిల్లి రామరాజు తటస్థంగా ఓటు వేశారు. కాంగ్రెస్‌కు చెందిన 19 మంది, బీజేపీకి చెందిన ఐదుగురు, ఒక స్వతంత్ర, ఒక ఎంఐఎం, 15 మంది బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో ఎన్నికల అధికారి అవిశ్వాసం నెగ్గినట్లుగా ప్రకటించి నూతన చైర్మన్ ఎన్నికయ్యే వరకు ప్రస్తుతం ఉన్న వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని ప్రకటించారు. అవిశ్వాస ప్రక్రియ అంతా వీడియోగ్రఫీలో చిత్రీకరించి, సమావేశం వివరాలు రాష్ట్ర పురపాలక శాఖకు పంపించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి నిర్ణయించిన తేదీలో చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. అవిశ్వాస తీర్మానం సందర్భంగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ భారీ పోలీసు బందోబస్తు చేపట్టారు. చివరకు ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చేతులు కలిపిన కాంగ్రెస్, బీజేపీ

బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానంలో కాంగ్రెస్, బీజేపీ చేతులు కలిపాయి. వాస్తవంగా కాంగ్రెస్‌కు ఉన్న సంఖ్యా బలానికి అవిశ్వాస తీర్మానం నెగ్గడం అంత సులువు కాదన్నది ఆది నుంచి ఉన్న చర్చ. కానీ అంతకు ముందే బీజేపీ సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా మద్దతు తెలుపుతున్నట్లు లోపాయికారిగా ఒప్పందం చేసుకున్నారు. అవసరమైతేనే చేతులు ఎత్తాలని అనుకున్నట్లు తెలిసింది. కానీ కౌన్సిల్ హాల్‌లో బహిరంగంగానే బీజేపీ సభ్యులు కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రసాద్ మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నారు. ఇక ఎంఐఎం సభ్యురాలు కొమ్ము నాగలక్ష్మి సైతం చివరి నిమిషం కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. బీఆర్ఎస్‌లో గెలుపొందిన కౌన్సిలర్లు 15 మంది ప్రలోభాలతో పార్టీ మారి అవిశ్వాస తీర్మానానికి జై కొట్టారు. దీంతో వీరి కుమ్మక్కు రాజకీయాలు పట్టణంలో హాట్ టాపిక్‌గా మారాయి. సభ్యుల అధికార దాహం, డబ్బు ప్రలోభాలు రాజకీయాలను మరింత భ్రష్టు పట్టిస్తున్నాయన్న చర్చ జోరుగా సాగుతున్నది.

విప్‌పై వారం రోజుల్లో చర్యలు : అదనపు కలెక్టర్ హేమంత్

నల్లగొండ మున్సిపల్ చైర్మన్ అవిశ్వాసం విషయం లో బీఆర్ఎస్ పార్టీ విప్ జారీ చేసినట్లు నాకు ఫిర్యాదు చేశారు. విప్ జారీ చేసిన విధానం, విప్ లోని సభ్యులు ఓటింగ్‌లో ఎలా ప్రవర్తించారు అనే విషయాన్ని మూడు రోజుల్లో విచారణ చేసి ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పిస్తాం. అక్కడి నుంచి వచ్చిన మార్గదర్శకాల ప్రకారంగా వారం రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటాం.

స్వార్థ రాజకీయాల కోసమే అవిశ్వాసం : మందడి సైదిరెడ్డి

రాజకీయ వ్యవస్థలో అవినీతి, అక్రమాలు జరిగితే అవిశ్వాసం పెడతారు.. కానీ నల్లగొండలో మాత్రం అందుకు భిన్నంగా స్వార్థ రాజకీయాల కోసమే పెట్టారు. నేను చైర్మన్‌గా ఎన్నికైన నాలుగేండ్ల కాలంలో మంత్రులు, మాజీ ఎమ్మెల్యే సహకారంతో వందల కోట్ల నిధులు తెచ్చి నల్లగొండను అభివృద్ధి చేశాం. కొందరు కౌన్సిలర్లు అధికారం ఎక్కడ ఉంటే ఆ పార్టీలోకి పోయి రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారు. గతంలో కోమటిరెడ్డి ఓడిపోయినప్పుడు అప్పటి చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మి నిందింపేందుకు వీలు ఉన్నా కూడా విలువలకు కట్టుబడి ఉన్నాం. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఇలాంటి రాజకీయాలు తగవు. కుట్రలు, కుతంత్రాలతో సొంత పార్టీకి అన్యాయం చేసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లపై అనర్హత వేటు వేయాలి.

మందకొడిగా ప్రజాపాలన డాటా ఎంట్రీ

సర్వర్ సమస్యలతో ఇబ్బందులు

దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ఎప్పటికి పూర్తయ్యేనో!

దామరచర్ల తాసీల్దార్ కార్యాలయంలో డాటా ఎంట్రీ చేస్తున్న సిబ్బంది

దామరచర్ల, జనవరి 8 : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం ప్రజా పాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. వాటిని ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టే కార్యక్రమాన్ని తాసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లోని సిబ్బందికి అప్పగించింది. సర్వర్ సమస్యతో డాటా ఎంట్రీ ఆలస్యంగా జరుగుతున్నది. ఈ నెల 17 వరకు పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు ఇవ్వగా వేల సంఖ్యలో ఉన్న దరఖాస్తులు సమయానికి పూర్తయ్యేది కష్టమేనని తెలుస్తున్నది. డాటా ఎంట్రీకి అదనంగా ఆపరేటర్లను ఏర్పాటు చేయకపోవడంతో కార్యాలయ సిబ్బంది., కార్యదర్శులే డాటా ఎంట్రీ చేపట్టారు. ప్రభుత్వం అదనంగా లాప్‌టాప్‌లు ఇవ్వక పోవడంతో వారి సొంత లాప్‌టాప్‌ల ద్వారా డాటా ఎంట్రీ నమోదు చేస్తున్నారు. ఆపరేటర్ రోజుకు 50కి మించి దరఖాస్తులు ఎంట్రీ చేయలేక పోతున్నారు. ఆపరేటర్‌కు మరొక వ్యక్తి సహాయకునిగా ఉండాల్సి వస్తున్నది. దామరచర్ల మండల వ్యాప్తంగా ప్రజా పాలనలో 17 వేల దరఖాస్తులు వచ్చాయి. ఇన్ని దరఖాస్తులు ఎంట్రీ చేయాలంటే ఎన్నిరోజులు పడుతుందో అర్థంకాని పరిస్థితి. డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లకు దరఖాస్తుకు ఐదు రూపాయల చొప్పున చెల్లిస్తున్నట్లు తెలుస్తుంది. మండల కేంద్రంలో చేపట్టిన డాటా ఎంట్రీని తాసీల్దార్ శంకర్‌నాయక్, ఎంపీడీఓ కృష్ణమూర్తి పర్యవేక్షిస్తున్నారు.

25 నుంచి జాన్‌పహాడ్ ఉర్సు

- అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ వెంకట్రావ్

జాన్‌పహాడ్ ఉర్సు నిర్వహణపై సమీక్షిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, జనవరి 8 : ఈ నెల 25 నుంచి పాలకవీడు మండలం జాన్‌పహాడ్ లో ఉర్సు ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి ఉత్సవాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 25 నుంచి 28 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉర్సుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆ దిశగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉర్సు నిర్వహణకు హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. దర్గా ఆవరణలో పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పార్కింగ్, తాగునీరు, విద్యుత్, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాత్కాలిక మరుగుదొడ్లను నిర్మించాలని సూచించారు. భక్తులకు సరిపడా బస్సులను నడుపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానున్నందున వారికి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ఉర్సును విజయవంత